

ముగ్గురు డిప్యూటీ తహసీల్దార్ల బదిలీ

కలెక్టరేట్, ఫిబ్రవరి 5: జిల్లాలోని రెవెన్యూ శాఖలో ముగ్గురు డిప్యూటీ తహసీల్దార్లను బదిలీ చేస్తూ సోమవారం కలెక్టర్ నాగలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. భూసేకరణ యూనిట్‌లో పనిచేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ పప్పు హరిని బొండపల్లికి, అక్కడ పనిచేస్తున్న శంకరరావును గుర్లకు బదిలీ చేశారు. అలాగే బొండపలిల్లో డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న హరికి ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు అప్పగించారు. నెల్లిమర్లలో సీఎస్‌డీటీ పని చేస్తున్న కె.శ్రీనివాసరావును విజయనగరం మండలం డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

మెగా డీఎస్సీ ఇవ్వకుంటే గద్దె దించేస్తాం

- కోట జంక్షన్‌లో నిరుద్యోగుల నిరసన
- వేలాదిగా తరలివచ్చి బైఠాయింపు



కోట జంక్షన్‌లో నినాదాలు చేస్తున్న నిరుద్యోగులు

ప్లకార్డుతో బైఠాయించిన యువతి



రాస్తారోకో చేస్తున్న నిరుద్యోగులు

విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 5: మెగా డీఎస్సీ ఇవ్వకుంటే ప్రభుత్వాన్ని దించడానికి సిద్ధం.. హామీలు నమ్మి మోసపోయాం.. 23 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాలి.. 117 జీవోను రద్దు చేయాలి.. ఉచిత పథకాలు వద్దు.. ఉద్యోగాలే ముద్దు అంటూ నిరుద్యోగులు ఉవ్వెత్తున నినదించారు. కోట జంక్షన్‌లో సోమవారం భారీ నిరసన దిగారు. వందలాదిగా తరలివచ్చిన నిరుద్యోగ యువతతో పాటు డీఎస్సీ అభ్యర్థులు తెలుగుయువత ఆధ్వర్యంలో ప్లకార్డులు పట్టుకుని నినాదాలతో హోరెత్తించారు. ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. నాలుగేళ్లుగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వని ప్రభుత్వం ఎన్నికల ముందు మొక్కుబడిగా తక్కువ పోస్టులతో నోటిఫికేషన్ ఇస్తామనడం సరికాదన్నారు. మినీ డీఎస్సీ వద్దు.. మెగా డీఎస్సీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆరు జిల్లాల్లో ఎస్‌జీటీలు 0 చూపిస్తున్నారని, నాలుగు జిల్లాల్లో సింగిల్ డిజిట్ చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 44 ఏళ్ల వయసు పరిమితి ఇచ్చి 42 ఏళ్లకు సడలించడం దారుణమన్నారు. కాగా కోటకు ఎదురుగా ప్రధాన రోడ్డుపై ధర్నా చేయడంతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమయ్యాయి. గుమ్చీ జంక్షన్ వైపు నుంచి వచ్చిన వాహనాలను పోలీసులు దారి మళ్లించారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు ధర్నా సాగింది. రాస్తారోకో నిర్వహించిన సందర్భంలో పోలీసులు కలుగజేసుకున్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించవద్దని కోరడంతో నిరుద్యోగులు ఓ పక్కకు జరిగారు. విజయనగరం డీఎస్పీ గోవిందరావు, ఐదుగురు సీఐలు, విజయనగరం వన్ టౌన్, టూ టౌన్ ఎస్‌ఐలు, ఏఆర్ సిబ్బంది బందోబస్తుకు వచ్చారు.

- కోట జంక్షన్‌లో నిరుద్యోగులు సోమవారం చేపట్టిన నిరసనకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుద్యోగులను ఈ ప్రభుత్వం నమ్మించి నట్టేట ముంచిందన్నారు. తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు మాట్లాడుతూ, జాబ్ క్యాలెండర్ అంటూ పాదయాత్ర సమయంలో హడావిడి చేసిన జగన్.. అధికారంలోకి వచ్చాక ఆ ఊసే లేకుండా చేశారన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా నాయకులు వేమలి చైతన్యబాబు, జి.సురేంద్ర, గంటా రవి పాల్గొన్నారు.



ఫ్లెక్సీకి అనుమతి తప్పనిసరి


- పంచాయతీ నుంచి తీసుకోవాల్సిందే
- తగిన రుసుంతో 30రోజుల వరకు ఏర్పాటు చేయొచ్చు
- ఎస్.కోట, కొత్తవలస మేజర్ పంచాయతీల్లో ఇక నుంచి అమలు

శృంగవరపుకోట, కొత్తవలస మేజర్ పంచాయతీల్లో ఎక్కడబడితే అక్కడ, ఎలా బడితే అలా ఫ్లెక్సీ, హోర్డింగ్‌లు ఏర్పాటు చేయడం ఇక కుదరదు. పంచాయతీల అనుమతి తీసుకోవాల్సిందే. రాజకీయ పార్టీలు, భవన యజమానులు, ఇతర వ్యాపార, వాణిజ్య యజమానులెవరైనా అనుమతి తీసుకున్నాకే ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాలి. తగిన రుసుంతో 30రోజుల వరకు ఆ ఫ్లెక్సీని ఉంచవచ్చు. ఈ పంచాయతీలు తీసుకున్న నిర్ణయాన్ని ప్రజలంతా హర్షిస్తున్నారు.

శృంగవరపుకోట, ఫిబ్రవరి 5:
ఫ్లెక్సీకి రుసుం చెల్లించడంతో పాటు అనుమతులు తీసుకోని వారిపై పంచాయతీరాజ్ చట్టం 1994 ప్రకారం సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకొనేందుకు సోమవారం ఈ రెండు పంచాయతీల కార్యనిర్వాహక అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. అనుమతులు తీసుకున్నప్పటికీ కొన్ని ప్రత్యేక సందర్భాల్లో రద్దు చేసేలా షరతులు విధించారు. ప్రజలకు అసౌకర్యం, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగే ప్రాంతాల్లో అనుమతులు ఇవ్వబోమని తేల్చిచెప్పారు. ప్రభుత్వ స్థలాల్లో ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేసేవారంతా తప్పనిసరిగా పంచాయతీ అనుమతి పొందడంతో పాటు తగిన రుసం చెల్లించేలా చర్యలు చేపడుతున్నారు. వీటితో ఏ విధమైన ప్రమాదం సంభవించినా వీటి యజమానులనే పంచాయతీ బాధ్యులను చేయనుంది.

శృంగవరపుకోట, కొత్తవలస మేజర్ పంచాయతీలు పట్టణ రూపురేఖలు కలిగి ఉంటాయి. విశాఖపట్నానికి సమీపంలో ఉండడంతో పాటు అరకు పర్యాటక ప్రాంత ప్రధాన రహదారిని ఆనుకుని వున్నాయి. దీంతో వివిధ రాజకీయ పార్టీలు, లేఅవుట్‌లు, భవన నిర్మాణ యజమానులు, వ్యాపార, వాణిజ్య యజమానులు ప్రకటనల కోసం ఎవరికి ఇష్టం వచ్చిన చోట వారు పెట్టేయడం పరిపాటిగా మారింది. ఇలా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను నెలలుగా తొలగించడం లేదు. పంచాయతీ కార్మికులు తీయాల్సి వస్తోంది. తుఫాన్‌లు, ఈదురుగాలుల సమయంలో కుప్పకూలుతున్నాయి. ఆ సమయంలో అక్కడెవరైనా వుంటే ప్రమాదాలు జరుగుతున్నాయి.

పంచాయతీ నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకపోవడంతో పాటు ఫ్లెక్సీల ఏర్పాటు సమయంలో గొడవలు పడుతున్నారు. ప్రధానంగా అధికార, ప్రతిపక్షాలకు చెందిన నేతలు అనువైన స్థలం కోసం పోటీపడుతున్నారు. ఇలా వివాదాలు చోటు చేసుకున్నప్పుడు ఇరువర్గాలూ పంచాయతీ అధికారులనే తప్పుపడుతున్నారు. ఇటు పంచాయతీకి ఆదాయం రాకపోవడంతో పాటు మాట పడాల్సిరావడంతో పంచాయతీ అధికారులు లోలోన మథన పడేవారు. అనేక అంశాలను దృష్టిలో వుంచుకున్న జిల్లా ఉన్నతాధికారులు పంచాయతీరాజ్ చట్టంలో వున్న నిబంధనలను వినియోగించుకోనేందుకు స్థానిక అధికారులకు అవకాశం కల్పించారు. తగిన రుసంతో ముందుస్తు అనుమతి తీసుకోవడంతో పాటు 30రోజుల నిర్దిష్ట సమయం మాత్రమే ఇవ్వడం ద్వారా వీటితో జరిగే అనర్థాలను అరికట్టనున్నారు.



శృంగవరపుకోట

రాజులగుమ్మడలో ఆటో-బస్సు ఢీ

- 15 మందికి గాయాలు
- పొలం పనులు ముగించుకుని ఆటోలో ఇంటికి వెళ్తుండగా ఘటన
- బాధితులది శివ్వాం గ్రామం



ధ్వంసమైన ఆటో

వంగర, ఫిబ్రవరి 5: రాజులగుమ్మడ సమీపంలో సోమవారం సాయంత్రం ఆటో, బస్సు ఢీకొని 15 మందికి తీవ్రగాయాలయ్యాయి. ముగ్గురు పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. బాధితులది శివ్వాం గ్రామం. పొలం పనులు ముగించుకని ఆటోలో ఇంటికి వెళ్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

శివ్వాంకు చెందిన కూలీలు ప్రతీరోజు చెరుకు కటింగ్ పనులకు రాజులగుమ్మడ వెళ్తున్నారు. రోజూలాగే ఆటోలో వెళ్లి సోమవారం సాయంత్రం ఇంటికి బయలుదేరారు. ఇంకా గ్రామం దాటనే లేదు. అంతలోనే రాజాం నుంచి రాజులగుమ్మడ వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఆ దాటికి ఆటో బోల్తాకొట్టింది. లోపల కూర్చొన్న కూలీలంతా ఒక్కసారిగా చెల్లాచెదురుగా పడిపోయారు. కొందరు లేవలేని పరిస్థితిలో ఆర్తనాదాలు చేశారు. క్షతగాత్రుల్లో కలమట రత్నాలు, ముంజు రమణమ్మ, పల్లి శంకరరావుకు తీవ్రగాయాలయ్యాయి. గెదెల నాగమణి, ఎస్.శంకర్, ఎ.కృష్ణవేణి, కె.శాంతి, బలగ తవుడమ్మ, గెదెల లప్పలనర్శమ్మ, జి.భద్రం, తుమ్మిడి గౌరు, బలగ లక్ష్మీలకు గాయాలయ్యాయి. ఆటోలో ఉన్నవారందరికీ గాయాలు తగిలాయి. రాజాం, రేగిడి, వంగరకు చెందిన 108 వాహనాల్లో క్షతగాత్రులను రాజాం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన ముగ్గురినీ శ్రీకాకుళం తీసుకువెళ్లాలని వైద్యులు సూచించారు.

బాధితులంతా కూలీలే. రాజాం సీఐ శ్రీనువాసరావు ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను విచారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. క్షతగాత్రులను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోండ్రుమురళీమోహన్ పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ఘటనలో ఆటో నుజ్జునుజ్జయింది. బస్సు ముందుభాగం దెబ్బతింది.







తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

11న దళిత సింహగర్జన

విజయవంతం చేయాలి: మాజీ ఎంపీ హర్షకుమార్

దాసన్నపేట, ఫిబ్రవరి 5: రాష్ట్ర ప్రభుత్వం దళితులపై అవలంబిస్తున్న నిరంకుశ ధోరణిని నిరశిస్తూ ఈనెల 11న రాజమహేంద్రవరంలోని వేమగిరిలో దళిత సింహగర్జన సభ నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంపీ హర్షకుమార్ తెలిపారు. ఆ సభకు దళితులంతా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విజయనగరానికి సోమవారం వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక రాయితీల ద్వారా అమలు చేస్తున్న 25 పథకాలను రద్దు చేశారని, ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని దళితులంతా ఏకం కావాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. అన్ని పార్టీలూ దళితులను రాజకీయంగా వాడుకుంటున్నాయన్నారు. పథకాలను సాధించుకునేందుకు దళితులంతా ఏకం కావాలని కోరారు. కార్యక్రమంలో ఎండా గోపాలరావు, ఆదాడ మోహనరావు, రాజేంద్రప్రసాద్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హర్షకుమార్

పంచాయతీరాజ్ చాంబర్ కార్యదర్శి గృహనిర్బంధం

నెల్లిమర్ల, ఫిబ్రవరి 5: రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ కార్యదర్శి గేదెల రాజారావును సోమవారం రాత్రి దన్నానపేట గ్రామంలో స్వగృహం వద్ద పోలీసులు అరెస్టు చేశారు. ఈ నెల 6న పంచాయతీరాజ్ చాంబర్ ఆధ్వర్యంలో చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు రాష్ట్ర నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు బయలుదేరిన రాజారావును పోలీసులు అరెస్టు చేశారు. చలో అసెంబ్లీకి ఎలాంటి అనుమతులు లేవని తెలిపారు. ఎస్‌ఐ రామగణేష్, సిబ్బంది వెళ్లి హౌస్ అరెస్టు చేశారు.



హౌస్ అరెస్టులో రాజారావు

జారితే అంతే..

- రాజాంలో ఆకతాయిల ఆగడాలు
- స్కూటీలపై స్టంట్‌ల ప్రదర్శన

రాజాం, ఫిబ్రవరి 5: సాహసానికి.. దుస్సాహసానికి తేడా తెలియని ఆ యువకులు రోడ్డుపై వెళ్లే వారిని ఇబ్బంది పెడుతూ తాము ప్రమాదంలో పడుతున్నారు. ఇది చూస్తున్న వారు ప్రశ్నించినా పట్టించుకోవడం లేదు. పెడచెవిన పెడుతూ తమ ఆకతాయి పనులు కొనసాగిస్తున్నారు. రాజాం పట్టణంలో వీరి ఆగడాలు రోజురోజుకు ఎక్కువ అవుతున్నాయి. స్కూటీలు, బైక్‌లపై స్టంట్‌లు చేస్తూ తోటి ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఓ యువకుడు స్కూటీ తోలుతుండగా వెనుక కూర్చున్న యువకుడు నిలబడి ఉండడం సోమవారం కనిపించింది. ఆ విన్యాసాలు చూసి ఎదురుగా వచ్చే వాహనదారులు భయభ్రాంతులకు గురయ్యారు. ఇలాంటి వారిపై పోలీసులు ప్రత్యేకంగా నిఘా పెట్టి చెక్ పెట్టాలని సీనియర్ సిటిజన్లు కోరుతున్నారు.



చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

● తెలుగుదేశం పార్టీ నాయకులు

టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నాయకులు తెలిపారు. సోమవారం జిల్లాలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ మరోసారి అధికారంలోకి వస్తే జరిగే నష్టాలను ఇంటింటికి వెళ్లి వివరించి కరపత్రాలను అందజేశారు. టీడీపీ మేనిఫెస్టోను వివరించారు. వంగర, రేగిడి మండలాల్లో పలు గ్రామాల నుంచి పలువురు టీడీపీలో చేరారు.

జగన్ ప్రభుత్వం ఇంటికి వెళ్లడం ఖాయం

వంగర: త్వరలో జగన్ ప్రభుత్వం ఇంటికి వెళ్లడం ఖాయమని టీడీపీ నాయకులు బొత్స వాసుదేవరావు, పిన్నింటిమోహన్, ఎల్.కృష్ణమూర్తి తెలిపారు. బాగెమ్మపేట, వంగర, పటువర్ధనం, కోనంగిపాడుతో పాటు పలు గ్రామాల్లో బాబుష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాటాడుతూ ప్రభుత్వం మాయమాటలతో భయపెడుతోందని, ఇది ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ధనలక్ష్మి, శ్రీను, నల్లా మురళి, వి.మురళి, రవి, గణపతి పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ నిర్వీర్యం

రాజాం: నాలుగు లక్షల మంది దళితులకు టీడీపీ హయాంలో ఉపాధి కల్పించిన ఎస్సీ కార్పొరేషన్‌ను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యంచేసిందని రాజాం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ ఆరోపించారు. వంగర మండలంలోని నీలయ్యవలస గ్రామానికి చెందిన మాజీ వైస్ సర్పంచ్ సూరినారాయణ, లక్ష్మణరావు, అప్పారావు, తదితర 20 వైసీపీ కుటుంబాలు సోమవారం రాజాం మండలంలోని శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో టీడీపీలో చేరాయి. వారికి కోండ్రు మురళీమోహన్ టీడీపీ కండువావేసి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూతన పారిశ్రామిక విధానం ద్వారా ఎస్సీలకు ఇచ్చే రుణాలపై టీడీపీ మొదటి ఏడాది నుంచి రాయితీ అమలు చేస్తే జగన్‌రెడ్డి మొదటి రెండేళ్లకే తొలగించి దళితులకు అన్యాయం చేశారని ఆరోపించారు. టీడీపీ హయాంలో విద్యార్థులకు ఉపయోగపడే చాలా పథకాలు తీసుకువస్తే వైసీపీ ప్రభుత్వం వాటిని దూరం చేసిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ వంగర మండలాధ్యక్షుడు మోహన్‌రావు,లచ్చుభుక్త కృష్ణమూర్తి, బెజ్జిపురపు రవి పాల్గొన్నారు.


వంగర: బాగెమ్మపేటలో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

75 కుటుంబాలు టీడీపీలో చేరిక

రేగిడి: మండలంలోని అప్పాపురం, మజ్జిరామునిపేటలోని 75 వైసీపీ కుటుంబాలు రాజాం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ సమక్షంలో టీడీపీలోకి చేరాయి. మజ్జిరామునిపేటలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మజ్జి సూర్యానారాయణ ఆధ్వర్యంలో కొమ్ము వెంకట రమణ, కొమ్ము లక్ష్మీనారాయణ, కొమ్ము సింహాద్రి, కిమిడి వెంకటరమణ, తాడ్డి బాన్నరాజు, మోహనరావు, శివకుమార్, తాడ్డి రామస్వామి తదితర 50 కుటుంబాలు, అనంతరం అప్పాపురంలో నిర్వహించిన కార్యక్రమంలో మరో25 వైసీపీ కుటుంబాలు సంజీవరావు ఆధ్వర్యంలో టీడీపీలోచేరాయి. కార్యక్రమంలో టీడీపీ నేతలు దూబ ధర్మారావు, కిమిడి అశోక్‌కుమార్, మజ్జి శ్రీనివాసరావు, మంతిన ఉషారాణి, కె.మహేశ్వరరావు, చల్ల భూజంగరావు, గురవాన రమేష్, పాలూరి రామినాయుడు, గేదల బాలమురళీ, కెంబూరి కోటీశ్వరరావు, గురవాన నారాయణరావు, నంది సూర్యప్రకాశ్‌రావు పాల్గొన్నారు.


రాజాం: టీడీపీలోచేరిన వారితో కోండ్రు మురళీమోహన్

వైసీపీ ప్రభుత్వం బీసీలకు మోసం


మాట్లాడుతున్న అప్పలనాయుడు

బాడంగి: వైసీపీ ప్రభుత్వం బీసీలను మోసం చేసిందని టీడీపీ విజయనగరం పార్లమెంట్ బీసీ సాధికార కొప్పలవెలమ చైర్మన్ కొల్లి అప్పలనాయుడు తెలిపారు. సోమవారం బాడంగిలో విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీసీలకు రక్షణ కరువైందన్నారు. దేశంలోనే తొలిసారిగా బీసీలకు రక్షణచట్టం తీసుకువచ్చి అండగా నిలవాలని బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీలో పొందుపరిచినట్లు చెప్పారు. బీసీలు అన్ని విధాలుగా అణచివేతకు గురయ్యారన్నారు. రానున్న ఎన్నికల్లో బీసీల ఐక్యంగా టీడీపీకి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పించిన ఘనత టీడీపీదేనని, 34 శాతం ఉన్న రిజర్వేషన్లు 24శాతానికి తగ్గించి జగన్‌రెడ్డి బీసీలకు అన్యాయం చేశారన్నారు. బీసీలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం మినహా ఒక్కరూపాయి నిధులు కూడా వెచ్చించలేదన్నారు. నియోజకవర్గంలో బీసీ ప్రజాప్రతినిదులకు కనీసగౌరవంలేకుండా పోయిందన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గంట్యాడ: మండలంలోని నరవ ఏఎంజీ కాలనీ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. బొండపల్లి మండలం జె.గుమ్మడాం గ్రామానికి చెందిన బి.అప్పలరాజు(42) ఆదివారం తనస్వగ్రామం నుంచి విశాఖ ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. నరవ ఏఎంజీ కాలనీ వద్దకు వచ్చేసరికి, ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. దీంతో తీవ్ర గాయపడిన ఆయన్ను 108వాహనంపై జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు.పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతిచెందాడు.

28 మద్యం సీసాల స్వాధీనం

రామభద్రపురం:రామభద్రపురంలో సోమవారం పోలీసులు జరిపిన దాడుల్లో 28 మద్యం సీసాలు అక్రమంగా తరలిస్తుండగా ఒకర్ని అరెస్టు చేసి, వాటిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ జ్ఞానప్రసాద్ తెలిపారు. ఈ మేరకు దత్తిరాజేరు మండలంలోని కోరపుకొత్తవలసకు చెందిన వ్యక్తిపై కేసు నమోదు చేశామని చెప్పారు. దాడుల్లో ఏఎస్ఐ అప్పారావు, కానిస్టేబుల్ నాగార్జున పాల్గొన్నారు.

బూరాడలో 25 సీసాలు

రేగిడి:మండలంలోని బూరాడలో సోమవారం బెల్ట్‌సాపు నిర్వహిస్తున్న ఓ వ్యక్తి నుంచి 25 మద్యంసీసాలు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఎన్నికలవిధుల్లో భాగంగా చేసిన సోదాల్లో నిందితుడ్ని అరెస్టుచేసినట్లు చెప్పారు.

ఇసుక ట్రాక్టర్ల నుంచి వసూలు

రేగిడి:మండలంలో ఇసుక అక్రమరవాణా చేస్తున్న ట్రాక్టర్లపై ఓ ప్రైవేట్ ఏజెన్సీ విజిలెన్స్, ఎస్ఈబీ పేరుతో ఈప్రాంతంలో పెత్తనం చలాయించడం చర్చనీయంశంగా మారింది. సంతకవిటి మండలంలో అధికారికఇసుక ర్యాంప్ కైవసం చేసుకున్న ఓ ప్రైవేట్ సంస్థ ఇక్కడ అక్రమరవాణా చేస్తున్న ఇసుక ట్రాక్టర్లపై విజిలెన్స్, ఎస్ఈబీ పేరుతో దాడులుచేస్తోంది. సోమవారం ఉంగరాడమెట్టసెంటర్ వద్ద ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పేరుతో 4,750లు వేబిల్లు చలనా ఇచ్చి బెదిరించి వసూలుచేసినట్లు పాతచెలిగాన వలసకు చెందిన ఓ ట్రాక్టర్ యజమాని తెలిపాడు. ఇలాగే ఈ ప్రాంతంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న పది వాహనాల యజమానుల నుంచి అపరాదరుసం విధించినట్లు సమాచారం. కాగా సంతకవిటి మండలంలోని మెడమర్తిలో అధికార రీచ్ ఉందని రాజాం సెబ్ సీఐ శ్రీధర్ ఆంధ్రజ్యోతికి తెలిపారు.ప్రైవేటు వ్యక్తులు ఇలా తనిఖీలు చేయకూడదని చెప్పారు. అక్రమరవాణా చేస్తే తమకు సమాచారం ఇవ్వాలని, వేరేచోట్ల క్వారీల ఇసుకరవాణాపై అధికారిక రేవులపేరుతో చలనారసీదుల ఇవ్వడం నేరమని చెప్పారు. ఈవిషయంపై ఉన్నతాధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆటోవర్కర్ల రాస్తారోకో



బొబ్బిలిలో రాస్తారోకో నిర్వహిస్తున్న ఆటో వర్కర్లు

బొబ్బిలి: ఫిట్‌నెస్ పేరుతో వాహనదారులను దోపిడీ చేస్తున్న ప్రభుత్వ విధానాలకు నిరసనగా సీఐటీయూఆధ్వర్యంలో ఆటోవర్కర్స్ యూనియన్ సోమవారం బొబ్బిలి చర్చిసెంటర్‌లో రాస్తారోకో నిర్వహించింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు మాట్లాడుతూ ఫిట్‌నెస్‌సర్టిఫికెట్ల జారీకి వాహనదారుల నుంచి వసూలు చేసే రుసుమును భారీగా పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తంచేశారు. తక్షణం ఈ విధానాన్ని రద్దుచేయాలని నినాదాలుచేశారు.కార్యక్రమంలో రాంబాబు పాల్గొన్నారు.

ఎండీఎం నిర్వాహకుల నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఎండీఎం నిర్వాహకులు

కలెక్టరేట్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలని మధ్యాహ్నం భోజన పథక నిర్వాహకులు (ఎండీఎం) సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ముందు సీఎం జగన్ తమకు పది వేలు వేతనం ఇస్తామని ప్రకటించారని తెలిపారు. అనంతరం డీఈవోకు వినతి పత్రం సమర్పించారు.

ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి

నెల్లిమర్ల మిమ్స్ కార్మికులు, ఉద్యోగులు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈసందర్భంగా సీపీఎం నాయకులు టి.సూర్యనాయణ మాట్లాడుతూ మిమ్స్‌లో పనిచేస్తున్న ముగ్గురు ఉద్యోగులను సస్పెన్షన్ చేయడం దారుణమన్నారు. ఉద్యోగులు రావల్సి బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. సమస్యలను పరిష్కరించకపోతే మరింత పోరాటం చేస్తామని హెచ్చరించారు.

5 నుంచి కాశీ విశ్వేశ్వరాలయ వార్షికోత్సవం

రాజాం:మొగులివలసలోని కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని మార్చి 5, 6, 7 తేదీల్లో నిర్వహించ నున్నారు. అర్చకులు దంతుర్తి వంశీకృష్ణ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు సోమవారం సమావేశమై వేడుకల తేదీలను నిర్ణయించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మజ్జి సత్య నారాయణ, బౌరోతు కాంతారావు, లెంక మురహరనాయుడు, లెంక సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పద్య పోటీల విజేతలకు బహుమతులు

రాజాం:సంతకవిటి మండలంలో బొద్దూరు జడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థులు అంతర్జాతీయ భాగవత పద్యపోటీల్లో ప్రథమ, ప్రోత్సాహక బహుమతులు గెలుచుకున్నారు. ఆరోతరగతి విద్యార్థి దేవర నవీన్ ప్రథమ స్థానంలో నిలిచాడు. సగందం శ్రావణి ప్రోత్సాహక బహుమతికి ఎంపికయ్యారు. వీరికి ఎంఈఓ భాస్కరరావు వరుసగా రూ.5,116, రూ.1,116 చొప్పున అందించారు.కార్యక్రమంలో హెచ్‌ఎం దాసరి మల్లేశ్వరరావు, తెలుగు ఉపాధ్యాయుడు పట్నాన కృష్ణ పాల్గొన్నారు.

అక్రమంగా చెట్ల నరికివేత


చెట్ల దుంగలను తరలిస్తున్న దృశ్యం

బొబ్బిలి: బొబ్బిలి పంచాయతీ రాజ్ సబ్‌డివిజన్ కార్యాలయ ఆవరణలో చెట్లను అక్రమంగా నరికి... తరలించారు. పాచి, కాగు, టేకు, వేప తదితర ఏడెనిమిది చెట్లను నరికించి బయటి వ్యక్తులకు అమ్మేశారు. ఈ విషయం బయటకు పొక్కడంతో తరలించిన కలపను మళ్లీ కార్యాలయ ప్రాంగణంలోనికి తెప్పించారు. వాస్తవానికి ప్రకటన ఇచ్చి వేలం ద్వారా ఇలాంటి కలపను అమ్మవలసి ఉంటుంది. అధికారులు నిబంధనలు పాటించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై డీఈఈ సీహెచ్‌వీ అప్పారావు మాట్లాడుతూ ఎదుగుదల లేని చెట్లను తొలగించామన్నారు. విషసర్పాల బెడద కారణంగా వాటిని తొలగించామన్నారు. మళ్లీ ఎందుకు తిరిగి కలపను తెప్పించారని అడగ్గా... ఏదో చిన్నపాటి కొమ్మలను నరికి పంపించామని... వివాదం ఎందుకనే ఉద్దేశంతో తిరిగి తెప్పించామన్నారు.

నేడు రాష్ట్ర స్థాయి కళాజాత

రాజాం: జనవిజ్ఞాన వేదిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీ వరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాలను కలుపుకుంటూ ప్రజాసైన్స్ కళాయాత్ర రానున్నదని ప్రతినిధులు జరజాన నీలయ్య, పెంకి చైతన్య కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం సాయంత్రం పొనుగుటివలసలో ప్రదర్శన జరగనుందని తెలిపారు.

డ్రగ్స్ వినియోగంపై చర్యలు తీసుకోండి

● ఎస్పీ గ్రీవెన్స్‌లో టీడీపీ నాయకుల వినతి


ఎస్పీ దీపికకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

విజయనగరం క్రైం: విజయనగరంలో కొందరు యువకులు డ్రగ్స్‌ని వినియోగించి, ద్విచక్రవాహనాలపై అతివేగంతో ప్రయాణించి భయభ్రాంతులకు గురిచేస్తుండడంతో చర్యలుతీసుకోవాలని టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, కనకల మురళీమోహన్, విజ్జపుప్రసాద్, గంటా పోలినాయుడులు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ దీపికాను కలిసి డ్రగ్స్ వినియోగంపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగించే వారు ప్రశ్నించే వారిపై తిరుగుబాటు చేసి దాడిచేస్తున్నారని తెలిపారు.

మోసగించే వారిపై చర్యలు: ఎస్పీ

జిల్లాలోని పలు స్టేషన్ల పరిధిలో నమ్మించి మోసగించే వారిపై దర్యాప్తుచేసి చట్ట పరిధిలో కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ దీపికా పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించి స్పందన కార్యక్రమంలో 39 ఫిర్యాదులను స్వీకరించారు.కార్యక్రమంలో ఏఎస్పీ అష్మాపరహీన్, ట్రైనీ ఐపీఎస్ మండా జావలీ ఆల్ఫాన్స్, డీఎస్పీ వీరకుమార్, సీఐలు మురళి, విజయానాథ్, నర్సింహమూర్తి, ఎస్ఐ ప్రభావతి పాల్గొన్నారు.

పాఠశాలల్లో లిప్ బృందం అధ్యయనం


తెర్లాంలో అభ్యసన స్థాయి పరిశీలిస్తున్న బృంద సభ్యులు

రేగిడి: మండలంలోని దేవుదళ కేజీబీవీ,సంకిలి హైస్కూల్‌లో సోమవారం 6,7,8 తరగతుల విద్యార్థుల అభ్యసనా సామర్థ్యం పెంపు, ఉపాధ్యాయులు తీసుకుంటున్న చర్యలపై మండలస్థాయి లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ (లిప్)బృందం తరగతుల వారీగా అధ్యయనం చేసింది. రేగిడి, వంగర మండలాలకు చెందిన మోనటరింగ్‌బృంద సభ్యులు జి.రవి, సీహెచ్ త్రిమూర్తి నాయుడు, హుస్సేన్, తిరుపతిరావు, ఎస్.దొరబాబుతో కూడిన బృందం పాఠశాలల్లో లిప్‌అమలుతీరు, తరగతి గదులకు వెళ్లి లిప్ రికార్డులు, బెస్, మిడ్‌లెవల్ పరీక్షపత్రాలు, విద్యార్థుల భాషాపరిజ్ఞానం పరిశీలిచింది. రికార్డులు, పాఠ్య ప్రణాళికలు తయారీ,తరగతుల వారీగా వెళ్లి విద్యార్థుల రీడింగ్, రైటింగ్ స్కిల్స్‌ను ఆరాతీసింది.కేజీబీవీ ప్రిన్సిపాల్ ఎం.లక్ష్మి, హెచ్‌ఎం రామినాయుడుతో సమీక్షించారు.సంకిలిహైస్కూల్‌లో నిర్వహించిన తనిఖీలో ఎంఈవోవరప్రసాదరావు పాల్గొన్నారు.

●తెర్లాం: తెర్లాం ఎమ్మార్సీలో 6,7,8 తరగతులకు అమలు చేస్తున్న అభ్యసనాభివృద్ధి కార్యక్రమం అమలుతీరు పరిశీలన బృంద సభ్యులతో ఎంఈవో సోమవారం సమావేశం నిర్వహించారు.మండలంలోని11 ఉన్నత,ఎనిమిది ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఎల్ఐపీలో అమలు చేస్తున్న వివిధ అంశాలను ఈ బృందం సోమవారం నుంచి పరిశీలించి ఉన్నతస్థాయి అధికారులకు నివేదిక అందించనుంది.కాగా సోమవారం తెర్లాం జడ్పీ ఉన్నత, కూనాయవలస ఎంపీయూపీ పాఠశాలలో 6,7,8 తరగతుల విద్యార్థులకు తెలుగు,ఆంగ్లం, గణితం, సైన్స్, సాంఘిక శాస్త్రంలో అమలు చేస్తున్న ఎల్ఐపీ కార్యక్రమం అమలు తీరును బృందం పరిలించింది బృందంలో బాడంగి, తెర్లాం మండలాల ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు ఉన్నారు.

ఖండ్యాంలో ఆయుర్వేద వైద్యసేవలు

రేగిడి:మండలంలోని ఖండ్యాం ఆయుర్వేద డిస్పెన్సరీ వైద్యధికారి సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో 140 మందికి తనిఖీలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో తంగి ప్రసాద్, సింహాచలం, కంబాల శైలజ పాల్గొన్నారు.

చెరకు ట్రాక్టర్ బోల్తా

● ఉంగరాడమెట్ట డౌన్‌లో ట్రాఫిక్‌కు అంతరాయం


రోడ్డుకు అడ్డంగా చెరకు పడిన దృశ్యం

రేగిడి: ఉంగరాడమెట్ట డౌన్‌లో సోమవారం మధ్యాహ్నం చెరకు ట్రాక్టర్ బోల్తా పడింది. రోడ్డుకు అడ్డంగా చెరకు పడిపోవడంతో పాలకొండ- రాజాం మార్గంలో ట్రాఫిక్‌కు కొంతసేపు అంతరాయం కలిగింది. ఎక్సిలేటర్ సహాయంతో రోడ్డుకు అడ్డంగా పడిన చెరకును తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. కాగా పాలకొండ- రాజాం రోడ్డు అడుగడుగునా అధ్వానంగా మారడంతో ఓవర్‌లోడ్‌తో వస్తున్న చెరకు ట్రాక్టర్లు ఇటీవల బోల్తాపడుతున్న విషయం విదితమే.

రాముని దర్శనం ఉచితంగా కల్పించాలి

● విజయనగరంలో కళాకారుల భారీ ర్యాలీ


విజయనగరంలో ర్యాలీచేస్తున్న భజన బృందం నిర్వాహకులు

విజయనగరం రింగురోడ్డు: అయోధ్య రాముని దర్శనం పేద హిందువులకు ఉచితంగా కల్పించాలని భజన గురువుల సంఘం ప్రతినిధి కాళ్ల నాగభూషణరావు కోరారు.ఈ మేరకు సోమవారం విజయనగరంలోని కోట జంక్షన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకూ హిందూభజన గురువులకు ప్రభుత్వం ఆర్థిక సాయంచేయాలని వేల సంఖ్యలో భజన గురువులు, కళాకారులు కళారూపాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరు నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కోలాటం, చెక్కభజన, తప్పెటగుళ్ల తదితర గురువులకు రూ.10 వేలు వేతనం ఇవ్వాలని కోరారు. అయోధ్యతోపాటు, రామేశ్వరం యాత్రకు ఉచితంగా కల్పించాలని కోరారు. ప్రభుత్వ అనుమతులతో సంబంధం లేకుండా హిందువుల పండుగ జరుపుకునే అవకాశం కల్పించాలని డిమాండ్‌చేశారు.

రైతులకు ఉపయోగపడే పనులు గుర్తించండి: పీడీ

లక్కవరపుకోట:ఉపాధిపథకంలో రైతులకు ఉపయోగపడే పనులను గుర్తించాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాపరమేశ్వరి కోరారు. సోమవారం ఎల్.కోటలో ఉపాధిహామీ పనుల సామాజిక తనిఖీ ప్రజావేదిక జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధిపనుల గుర్తింపులో కొత్తదనం ఉండాలని, రైతులకు ఉపయోగపడే ఫీల్డ్,ఫీడర్ చానళ్ల పనులుచేయాలని, పంటపొలాల్లో గుంతల నిర్మాణం, మొక్కల పెంపకం వంటి పనులను చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అంబుడ్స్‌మెన్ అన్నపూర్ణ, ఏపీడీ శారదాదేవి, ఎంపీడీవో కె.రూపేష్, ఏపీవో విజయలక్ష్మి, ఏఈ ఉమామహేశ్వరరావు, పీఆర్ జేఈ వీరలక్ష్మి, ఎస్సార్పీ మాదవ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఉమాపరమేశ్వరి

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

లక్కవరపుకోట (కొత్తవలస): కొత్తవలస మండలంలోని వియ్యంపేటలోని బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఇంగ్లీషు మీడియం ఐదో తరగతి, ఇంటర్ ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.జయశ్రీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతిలో అడ్మిషన్ కావాలనుకునేవారు 2023-24లో ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో నాలుగో తరగతి పూర్తి చేయాలన్నారు. ఈ నెల 23లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అయిదో తరగతి ప్రవేశ పరీక్ష మార్చి 10న నిర్వహిస్తామని తెలిపారు.

డీఎస్పీ శ్రీధర్‌కు సన్మానం

బొబ్బిలి: స్థానిక బ్రహ్మకుమారీస్ కేంద్రంలో కడప జిల్లాకు బదిలీపై వెళ్తున్న బొబ్బిలి డీఎస్పీ శ్రీధర్ దంపతులను సోమవారం ఆత్మీయ వీడ్కోలు పలికారు.ఈ మేరకు బీకే రాజేశ్వరి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ సన్మానించారు.

'స్పందన'కు అధికారులు దూరం

వంగర: ప్రజల సమస్యలు నేరుగా విన్నవించుకునేందుకు మండల కేంద్రంలో స్పందన ప్రవేశపెట్టినట్లు చెప్పిన అధికారులు ఆచరణలో విఫలమయ్యారు. సోమవారం స్పందనకు వివిధ శాఖల అధికారులు అర్జీలతో వచ్చినప్పటికీ..స్వీకరించే వారులేక ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ సురేష్ వచ్చేవారం నుంచి స్పందనకు అన్నిశాఖల అధికారులు హజరు కావాలని, లేదంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డ్రోన్ ఆచూకీ లేదు

వంగర:బాగెమ్మపేట-పటువర్ధనం గ్రామాల మధ్య భూసర్వేకోసం వదిలిన డ్రోన్ కనిపించకుండాపోయిన సంగతితెలిసిందే. సోమవారం నిపుణుల బృందాలు రెండు గ్రామాల్లోని కొండల్లో గాలించినా ఫలితం కనిపించలేదు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

బొబ్బిలి: బొబ్బిలి తహసీల్దార్‌గా ఎస్.కిరణ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం జిల్లా రణస్థలం నుంచి బదిలీపై బొబ్బిలి వచ్చారు. ఇక్కడ పని చేసిన తహసీల్దార్ డోల రాజేశ్వరరావుకు అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీ అయిన సంగతి తెలిసిందే. కిరణ్ కుమార్‌ను డీటీలు రెడ్డి సాయికృష్ణ, గౌరీశంకర్, ఆర్ఐ కళ్యాణ చక్రవర్తి, సిబ్బంది అభినందించారు.

వైభవంగా నూకాలమ్మ తీర్థమహోత్సవం

లక్కవరపుకోట (కొత్తవలస): కొత్తవలస మండలంలోని వియ్యంపేట గ్రామదేవత నూకాలమ్మ తీర్థమహోత్సవాన్ని సోమవారం గ్రామస్థులు వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. దేవాడ, వియ్యంపేట, కోటవాని పాలెం, కోన, మసివానిపాలెం, వి.బి.పురం గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు వచ్చి నూకాలమ్మను దర్శించుకున్నారు. సాయంత్రం ఎడ్లబండ్ల పోటీలు నిర్వహించారు. మొత్తం 11 బండ్లు పందెంలో పాల్గొనగా... వల్లంపూడి బండి విజేతగా నిలిచింది. గెలిపొందిన వారికి గ్రామ పెద్దలు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోపమ్మ, సర్పంచ్ రాము, చిన్నంనాయుడు, అప్పలనాయుడు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో వినతులు పరిష్కరించండి: కలెక్టర్

● 'జగనన్నకు చెబుదాం'లో భూసమస్యలపై 132 అర్జీలు

కలెక్టరేట్: వినతులు సకాలంలో పరిష్కరించాలని కలెక్టరు నాగలక్ష్మి ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అధికంగా భూసమస్యలపై వినతులు వచ్చాయి. వివిధ సమస్యలపై 199 వినతులు రాగా, వీటిల్లో 132 వినతులు భూసమస్యలపై ఉండడం విశేషం. కలెక్టరు నాగలక్ష్మి, జేసీ కార్తీక్, డీఆర్వో అనిత, ట్రైనీ కలెక్టరు త్రివాంగ్ వినతులు స్వీకరించారు. కాగా విజయనగరం బిట్ 1 తోటపాలెం పరిధిలో సర్వే నెంబరు 53-4, 53-5లో ఉన్న భూమిని వ్యవసాయభూమిగా ఎలా మార్చారో తెలియజేయాలని శ్రీసత్యసాయి సాయినగర లేఅవుట్ ప్లాట్లు యాజమానులు దాట్ల విజయలక్ష్మి, జి.మోహనరావు, ఆర్‌కే ప్రసాద్ కోరారు. అధికారులు స్పందించి వెబ్‌ల్యాండ్‌పెట్టిన సర్వేనెంబర్లను మార్పుచేయాలని విన్నవించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ తమ భూములు ఇచ్చామని, ఇప్పటివరకూ పరిహారం ఇవ్వలేదని భోగాపురం మండలంలోని అమటాం రావివలస గ్రామానికి చెందిన ఏవీ రమణ, వెంటకలక్ష్మి, దాలి నాయుడు తదితరులు విన్నవించారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లాలోని ఇంటర్,పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలకు 27,277 మంది విద్యార్థులకు 129 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పరీక్షలు నిర్వహణకు 1600 మంది ఇన్విజిలేటర్లు, తొమ్మిది మంది ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమిస్తున్నట్లు తెలిపారు. 94 కేంద్రాల్లో 45,000 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాయనున్నారని చెప్పారు.నులిపురుగులను నిర్మూలనకు చర్యలు చేపట్టాలని కలెక్టరు నాగలక్ష్మి ఆదేశించారు. ఈనెల తొమ్మిదో తేదీన జాతీయనులిపురుగులు నివారణ దినోత్స వం పురస్కరించుకుని నులి పురుగులు నివారణ కోసం అల్బెండజోల్ మాత్రలను ఏడాది నుంచి 19 ఏళ్ల వయస్సు గల వారికి మింగించాలని సూచించారు. నవరత్నాలు పేదలందరికీ మంజూరైన స్థలాలు రిజిస్ట్రేషన్లు వేగంగా జరగాలని కలెక్టరు ఆదేశించారు. జిల్లాలోని 31 వేలు డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్‌కు సిద్ధంగా ఉన్నామన్నారు. కాగా జర్నలిస్టు ఇళ్ల స్థలాలకు కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించాలని ఆదేశించారు. తొలిదశగా 276 మంది జర్నలిస్టుల సమాచారాన్ని మండలాలకు పంపించామని చెప్పారు.కార్యక్రమంలోని జేసీ కార్తీక్ పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న కలెక్టరు నాగలక్ష్మి

కోళ్ల కుటుంబానికి పరామర్శ


లలితకుమారిని పరామర్శిస్తున్న బేబీనాయన

లక్కవరపుకోట: ఎస్.కోట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కుటుంబాన్ని పలువురు రాజకీయనేతలు పరామర్శించారు. కోళ్ల అప్పలనాయుడు సతీమణి పైడితల్లమ్మ పెద్దకర్మ సందర్భంగా వివిధపార్టీల నాయకులు హాజరయ్యారు. టీడీపీ బొబ్బిలి, సాలూరు నియోజకవర్గాల ఇన్‌చార్జులు బేబీనాయన, గుమ్మిడి సంధ్యారాణి, మాజీఎమ్మెల్సీ శ్రీనివాసులనాయుడు, డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు, ఎంపీపీ సత్యవంతుడు, వల్లూరి జయప్రకాశ్‌బాబు, స్థానిక నేతలు పరామర్శించారు.

బోడసింగిపేటలో అక్రమ కట్టడాలు

● చోద్యం చూస్తున్న పంచాయతీ అధికారులు

బొండపల్లి: బోడసింగిపేట గ్రామానికి సమీపంలో జాతీయ రహదారి 26కు ఆనుకొని గత కొన్ని రోజులుగా రూ.లక్షల విలువైన ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తూ అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారు. పంచాయతీ పరిధిలోని రహదారికి ఇరువైపులా ఉన్న ఖాళీ ప్రభుత్వ స్థలాలను వివిధ వ్యాపారాల కోసం పంచాయతీ అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మాణాలను చేపడుతున్నారు. ఇక అక్రమ నిర్మాణాలు పూర్తయిన వెంటనే పంచాయతీ అధికారుల ధ్రువీకరణ పత్రంతో పాటు ఇంటి పన్ను రశీదు తప్పనిసరిగా ఉంటేనే విద్యుత్ కనెక్షన్ పొందే అవకాశం ఉంది. నిర్మాణాలను పూర్తిచేసి తరువాత వెంటనే విద్యుత్ సౌకర్యం కూడా పొందుతున్నారు. ఇక్కడ సెంటు భూమి ధర రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షలు పలకడంతో అక్రమార్కులు పోటీపడీ మరీ నిర్మాణాలను సాగిస్తున్నారు. ఈ ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా గతంలో నిర్మాణాలు ఉండడంతో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరిగేవి. ఇటీవల జాతీయ రహదారి విస్తరణలో భాగంగా వాటిని తొలగించారు. మళ్లీ ఇప్పుడు ఆ ఖాళీ స్థలాల్లో శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నారు.



రహదారి పక్కన అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న దృశ్యం

చర్యలు తీసుకుంటాం

గతంలో అక్రమ నిర్మాణాలు చేపట్టిన కొంతమందికి నోటీసులు ఇచ్చాం. ఇప్పుడు మరికొంతమంది నిర్మాణాలను చేపడుతున్నట్లుగా మా దృష్టికి వచ్చింది. దీనిపై రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

- సీహెచ్ సత్యవతి, పంచాయతీ కార్యదర్శి, బోడసింగిపేట

పాత కాలువ ద్వారానే సాగునీరు అందించాలి

బొండపల్లి: గతంలో ఉన్న సాగునీటి కాలువ(పైపులైను) ద్వారానే ఎం.కొత్తవలసలోని మజ్జివాని చెరువుకు జె.గుమడాం నుంచి ఫీడర్ కొండవాగు నుంచి సాగునీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన పలువురు రైతులు కోరారు. గ్రీన్‌ఫీల్డ్ అధికారులు కప్పివేసిన కాలువను ఎం.కొత్తవలస గ్రామానికి చెందిన పలువురు రైతులు సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా గుమడాం గ్రామానికి ఎగువన ఉన్న కొండవాగు నుంచి కాలువ ద్వారా వచ్చే సాగునీరు ఎం.కొత్తవలస గ్రామానికి చెందిన మజ్జివాని చెరువులోకి వెళ్లకుండా పైపులైన్లను పూర్తిగా కప్పివేశారని తెలిపారు. దీనికి ప్రత్యామ్నాయంగా గ్రీన్‌ఫీల్డ్ అధికారులు కొద్ది దూరంలో కాలువ నుంచి ఐవోటీ కాలువను నిర్మించారని, దీనివల్ల కాలువ కంటే ఐవోటీ నిర్మాణం ఎత్తుగా ఉండడం వల్ల కాలువ ద్వారా సాగునీరు కింద ఉన్న మజ్జివాని చెరువుకు పూర్తి స్థాయిలో వెళ్లడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల 38 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువుతోపాటు ఆయకట్టు కిందనున్న 250 ఎకరాల సాగుచేసే రైతుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిందని రైతులు చెప్పారు. కప్పివేసిన కాలువను పునరుద్ధరించి పాత కాలువ ద్వారానే సాగునీరు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కర్రోతు శ్రీనివాసరావు, రైతులు మజ్జి అప్పారావు, కర్రోతు జనార్ధనరావు, కొవ్వాడ అప్పలనాయుడు, శిగనం అప్పలనాయుడు, పతివాడ మురళి తదితరులు పాల్గొన్నారు.


గ్రీన్‌ఫీల్డ్ అధికారులు కప్పివేసిన కాలువను పరిశీలిస్తున్న ఎం.కొత్తవలసకు చెందిన రైతులు

టీడీపీ హయాంలోనే బీసీలకు ఆదరణ

పాచిపెంట: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హయాంలోనే బీసీలకు ఆదరణ ఉండేదని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గుమ్మడి సంధ్యారాణి అన్నారు. సోమవారం మిర్తివలసలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో 60 శాతం బీసీలు ఉన్నప్పటికీ ఈ ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో సాలూరు మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్‌దేవ్, టీడీపీ మండల అధ్యక్షుడు పిన్నింటి ప్రసాద్‌బాబు, నాయకులు ముఖి సూర్యనారాయణ, కొత్తల పోలినాయుడు, కొత్తల సత్యవతి, సాలూరు నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు విశ్వప్రసాద్, రెడ్డి రాజగోపాల్, ఆముదాల పరమేష్, తదితరులు పాల్గొన్నారు.


మిర్తివలసలో పర్యటిస్తున్న సంధ్యారాణి

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు

గరుగుబిల్లి: మండల తహసీల్దార్‌గా కె.జయ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు విధులు నిర్వహించిన జి.వెంకటజనార్ధన్ సీతానగరం తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. విశాఖపట్నం జిల్లా గోపాలపట్నం తహసీల్దార్‌గా పనిచేస్తున్న జయ ఇక్కడకు బదిలీ అయ్యారు. సోమవారం బాధ్యతలు స్వీకరించిన ఆమెకు రెవెన్యూ సిబ్బంది అభినందనలు తెలిపారు. ● **పాలకొండ:** పాలకొండ తహసీల్దార్‌గా కె.వరహాలు సోమవారం బాధ్యతలు చేపట్టారు. విశాఖపట్నం జిల్లా ఆరిలోవ తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపైన పాలకొండ వచ్చారు. ఆయనకు రెవెన్యూ సిబ్బంది స్వాగతం పలికారు. ఇంతవరకు తహసీల్దార్‌గా పనిచేసిన సోమేశ్వరరావు అరకు బదిలీపై వెళ్లారు. ● **గుమ్మలక్ష్మీపురం:** గుమ్మలక్ష్మీపురం తహసీల్దార్‌గా సత్యనారాయణ సోమవారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత అభివృద్ధికి, ప్రజలకు సకాలంలో సేవలు అందించడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. గుమ్మలక్ష్మీపురం ఏఎస్‌పీసీ ఎంపీడీవోగా జగదీశ్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ● **సీతంపేట:** సీతంపేట తహసీల్దార్‌గా ఎస్.మహేశ్వరరావు సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకు రావాలన్నారు. అనంతరం పీవో కల్పనాకుమారిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీటీ ప్రసాద్, ఆర్ఐ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు. ● **పాచిపెంట:** పాచిపెంట తహసీల్దార్‌గా పి.బాల సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆమె శ్రీకాకుళం జిల్లా పలాస రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఏవోగా పనిచేస్తూ పదోన్నతిపై తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు.

స్పందనకు వినతుల వెల్లువ

కలెక్టరేట్, ఐటీడీఏ, ఎస్పీ కార్యాలయాల్లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి అధిక సంఖ్యలో అర్జీదారులు వినతులు అందజేశారు. ఈ సమస్యలకు పరిష్కారం చూపేలా ఆయా ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్పీ విక్రాంత్ పాటిల్

జగనన్నకు చెబుదాంకు 185 వినతులు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 185 వినతులు అందాయి. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ నిశాంత్ కుమార్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ వినతులకు సత్వరం శాశ్వత పరిష్కారం చూపించాలని ఆయన ఆదేశించారు. ప్రజలు సామాజిక, వ్యక్తిగత అంశాలపై 185 అర్జీలు అందించారు. ఈ కార్యక్రమంలో జేసీ ఆర్.గోవిందరావు, ఐటీడీఏ పీవో సి.విష్ణుచరణ్, కేఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్ జి.కేశవనాయుడు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి కె.రాబర్ట్‌పాల్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ స్పందనకు 164 వినతులు

సీతంపేట: ఐటీడీఏ ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్య క్రమానికి 164 వినతులు వచ్చినట్లు పీవో కల్పనాకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో రోసిరెడ్డి, ట్రైబుల్ వెల్ఫేర్ ఈఈ సింహాచలం, డీడీ అన్నదొర, జీసీసీ డీఎం సంధ్యారాణి, సీడీపీఓ రంగలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలీసు 'స్పందన'లో 7 ఫిర్యాదులు

బెలగాం: 'స్పందన' కార్యక్రమంలో ఏడు ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. పార్వతీపురంలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి ఫిర్యాదు చేయడానికి వచ్చిన అర్జీదారుల సమస్యలను స్వయంగా విని త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు తదితర సమస్యలపై ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఒ.దిలీప్ కిరణ్, ఎస్పీ సీఐ సీహెచ్.లక్ష్మణరావు, డీసీఆర్బీ సీఐ వాసు నాయుడు, ఎస్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

కనీస వేతనం మంజూరు చేయాలి

పాచిపెంట: ఆశావర్కర్లకు కనీస వేతనం మంజూరు చేయాలని, వివిధ డిమాండ్లను పరిష్కరించాలని శ్రామిక మహిళా జిల్లా నాయకురాలు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు వి.ఇందిర కోరారు. సోమవారం పాచిపెంటలో పోస్టర్లు విడుదల చేశారు. ప్రభుత్వ సెలవులు, మెటర్నరీ సెలవులు అమలు చేయాలని అన్నారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పు చేయాలని డిమాండ్ చేశారు. వీరి డిమాండ్లపై చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు జి.మంజుల, పి.నిర్మల, ఆశా వర్కర్లు, సీఐటీయూ నాయకులు కోరాడ ఈశ్వరరావు పాల్గొన్నారు. ● **సీతంపేట:** ఆశ వర్కర్లు ఫిబ్రవరి 8న చేపట్టే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు పిలుపు నిచ్చారు. సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆశ వర్కర్స్ సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీఐటీయూ మండల కమిటీ కార్యదర్శి ఎం.కాంతారావు, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు లక్ష్మి, మాలతి, ఉష తదితరులు పాల్గొన్నారు.

అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

పార్వతీపురం టౌన్: జిల్లా కేంద్రంలోని కొత్తవలస రైల్వేస్టేషన్‌కు అనుసంధానంగా అండర్ బ్రిడ్జి గానీ, పాస్‌వే నిర్మాణం గానీ చేపట్టాలని కోరుతూ అరకు ఎంపీ జి.మాధవికి, డీఆర్‌ఎం సరఫ్ ప్రసాద్‌కు, సీనియర్ డివిజనల్ ఇంజినీర్ మీనాలకు ఏపీ టిడ్కో ఛైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్‌తో కలిసి వినతిపత్రాలు అందజేశామని కొత్తవలస గ్రామ ప్రతినిధులు తెలిపారు. ఎంపీ మాధవిని విశాఖపట్నంలోని తన కార్యాలయంలో సోమవారం కలిసి, సమస్యను వివరించామని చెప్పారు. పార్వతీపురం పట్టణ రైల్వేస్టేషన్‌కు మూడో లైన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, పనులు అనంతరం ఇరువైపులా గోడలు కట్టేందుకు రైల్వే అధికారులు సిద్ధమవుతున్నారన్నారు. సుమారు 9 గ్రామాల ప్రజల రాకపోకలకు, కొత్తవలస ప్రాంతం ప్రజలకు మేలు జరిగే విధంగా అండర్ పాస్‌వే నిర్మాణం జరిగే విధంగా పరిపాలన అనుమతులు ఇవ్వాలని కోరామని తెలిపారు. దీనిపై ఎంపీ సానుకూలంగా స్పందిస్తూ వెనువెంటనే సంబంధిత రైల్వే అధికారులకు సమస్య పరిష్కారం కోసం లిఖిత పూర్వక ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. డీఆర్‌ఎం సానుకూలంగా స్పందించి.. విజయరామరాజుకాలనీ కొత్తవలస నుంచి బెలగాం రైల్వే గేటు వరకు రోడ్డు నిర్మాణానికి, మధ్యలో అండర్ పాస్ నిర్మాణం తక్షణమే చేపట్టేందుకు, అలాగే విజయరామరాజు కాలనీ నుంచి సత్యనారాయణస్వామి ఆలయం వైపు మరో అండర్ పాస్ గానీ ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి గానీ అధికారుల బృందాన్ని పంపించి సర్వే జరిపిస్తామని చెప్పారు. లోపలకు ప్రయాణించేందుకు అవసరమైన అండర్ పాస్, బ్రిడ్జి నిర్మాణంపై సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తామని డీఆర్‌ఎం హామీ ఇచ్చారని తెలిపారు. ఎంపీ, డీఆర్‌ఎంలను కలిసిన వారిలో దేవకోటి శంకరరావు, బి.శేఖర్, పాత్రుని దినేష్, దివిలి ఉమా, మహేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

ముగిసిన ప్రపంచ ఒడియా భాషా సదస్సు


వేదికపై బిశ్వాల్, బాబిలత, శ్రీనివాస్ తదితరులు

రాయగడ: గత మూడు రోజులుగా జిల్లా కేంద్రంలో జరుగుతున్న ప్రపంచ ఒడియా భాషా సదస్సు సోమవారంతో ముగిసింది. స్థానిక ఆటానమస్ కళాశాలలో జరిగిన ముగింపు కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు ప్రముఖ రచయితల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఒడియా భాషా సదస్సు నోడల్ అధికారి భగవాన్ బిశ్వాల్, ప్రిన్సిపాల్ బాబిలత షారాప్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు నిర్వహించిన పద్యరచన, కవిత, నాటిక, పఠనం వంటి పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

గ్రీవెన్స్‌కు అధిక సంఖ్యలో వినతులు

రాయగడ: నూతన కలెక్టర్ ప్రమోద్ సత్యవాన్ ఆధ్వర్యంలో తొలిసారిగా కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌కు సోమవారం అర్జీదారులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. సమస్యలను కలెక్టర్‌కు విన్నవించారు. అందరి సమస్యలను విన్న కలెక్టర్ వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత విభాగాల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.


అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్

మార్చి 11 నుంచి శతావధానం

ఒడిశా

రాయగడ: తెలుగు భాషలో శతావధానం ప్రక్రియకు విశిష్ట ప్రాధాన్యం ఉందని, రాష్ట్రంలో తొలిసారిగా రాయగడలో దీన్ని నిర్వహించనున్నామని ఉత్కళ బ్రాహ్మణ సమాజం అధ్యక్షులు రేజేటి శ్రీనివాస శర్మ తెలిపారు. స్థానిక బాలాజీ మందిరంలో జరిగిన ఉత్కళ బ్రాహ్మణ సమాజం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రముఖ శతావధాని బులుసు అపర్ణ ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన 100 ప్రాశ్నికులు పాల్గొంటారని, బంకుపల్లి రమేష్ సంచాలకులుగా వ్యవహరించనున్నారని తెలిపారు. మార్చి 11 నుంచి 13 వరకు మూడు రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి భళ్లమూడి నాగరాజు, ఉపాధ్యక్షుడు అవసరాల నారాయణ మూర్తి, కోశాధికారి సుబ్రమణ్యశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమమే టీడీపీ ధ్యేయం

బొండపల్లి: బీసీ సంక్షేమమే ధ్యేయంగా టీడీపీ పనిచేస్తుందని మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడు అన్నారు. సోమవారం బొండపల్లి గ్రామంలో దివంగత మాజీ ఎమ్మెల్యే జేఎస్ఎన్ రాజు ఇంటి వద్ద టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెన్ను సన్యాసినాయుడు ఆధ్వర్యంలో మండల స్థాయి జయహో బీసీ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కేఏ నాయుడు మాట్లాడుతూ బీసీల శ్రేయస్సుకే టీడీపీ పుట్టిందన్నారు. చంద్రబాబు హయాంలో బీసీలకు 30 శాతం రిజర్వేషన్ పెంచి వెన్నుదన్నుగా నిలిచారన్నారు. కార్యక్రమంలో జయహో ప్రోగ్రాం నియోజకవర్గ కన్వీనర్ అల్లు విజయ్ కుమార్, మాజీ జడ్పీటీసీ బి.బాలాజీ, టీడీపీ మండల అధ్యక్షుడు కోరాడ కృష్ణ, మహిళా అధ్యక్షురాలు ముంజేటి పార్వతి, చంటిరాజు, రాపాక అచ్చంనాయుడు తోపాటు బోడసింగిపేట, రయింద్రం సర్పంచ్‌లు మీసాల జానకిరావు, ముదునూరు శ్రీనివాసరావు, తాళ్లపూడి రమణ పాల్గొన్నారు.

50 కుటుంబాలు చేరిక

దత్తిరాజేరు: పప్పల లింగాలవలస గ్రామానికి చెందిన 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. రాజులరామచంద్రపురంలో మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడు ఆధ్వర్యంలో వీరు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరినవారిలో మాజీ ఎంపీటీసీ కామిరెడ్డి సత్యనారాయణ, 3వ వార్డు మెంబరు కామిరెడ్డి శ్రీను, ఆరో వార్డు మెంబరు కడియాల నూకయ్య, కె.ప్రసాద్, జి.సింహాచలం, కె.అప్పలనాయుడుతో పాటు జగన్నాథపురం గ్రామానికి చెందిన కొల్లి చిన్నారావు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పెద్దింటి మోహన్, క్లస్టర్ ఇన్‌చార్జిలు మజ్జి మహేష్, పెద్దింటి జగన్, బెజవాడ బంగారునాయుడు, కొండబాబు, గుసిడి జగన్నాథం, కువైట్ రాము, ముకుందరావు, పప్పల త్రినాథ పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి

నెల్లిమర్ల: కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించడం ద్వారా కార్మిక అమర వీరుల ప్రాణ త్యాగాలకు సార్థకత చేకూరుతుందని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి స్థానిక అమరవీరుల స్మారక భవనంలో అమర కార్మికుల 30వ వర్థంతి సభను ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ నిర్వహించింది. ఈసందర్భంగా నెల్లిమర్ల అమరవీరులకు, అమరవీరుల కుటుంబాలకు నివాళులర్పించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు కాళ్ల అప్పలసూరి అధ్యక్షతన జరిగిన సభలో కార్మికోద్యమ నేత ఉమామహేశ్వరరావు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు కె.మల్లయ్య, ఎం.గోపాలం, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కె.నిర్మల, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి బి.గీత. ఉపాధ్యాయ ఉద్యమ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలు అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ రమేష్

గజపతినగరం: ఓటర్ల జాబితాలో చనిపోయినవారి పేర్లు తొలగించకపోవడం, డబుల్ ఎంట్రీలపై బీఎల్‌ఓలు అప్రమత్తంగా ఉండాలని, లేనిఎడల చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్‌వీ రమేష్ హెచ్చరించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కో పోలింగ్ కేంద్రంలో ఎన్ని ఓట్లు ఉన్నాయి, మృతిచెందినవారు, డబుల్ ఎంట్రీలు ఎన్ని ఉనాయో ఇంటింటికీ వెళ్లి పరిశీలించిన అనంతరం నివేదిక అందజేయాలన్నారు. ఇందులో రాజకీయ జోక్యం తగదన్నారు. తప్పులు జరిగినట్లయితే అందుకు బీఎల్‌ఓలను బాధ్యులుగా చేరుస్తామని చెప్పారు. విధులు సక్రమంగా నిర్వహించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల ఉప తహసీల్దార్ సతీష్, డీటీ సత్యనారాయణ, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్‌లో అన్యాయం

● నాగబాబు దృష్టికి తీసుకెళ్లిన జనసేన కార్యకర్తలు

తెర్లాం: రాష్ట్ర వ్యాప్తంగా 30 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉండగా ఆరువేల పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడం అన్యాయమని జనసేన నేత నాగబాబు వ్యాఖ్యానించినట్లు సుందరాడ గ్రామానికి చెందిన పార్టీ నాయకుడు భార్గవసాయి తెలిపారు. డీఎస్సీ అభ్యర్థులతో కలిసి సోమవారం హైదరాబాద్‌లో నాగబాబును కలిశామని.. ఇది చాలా అన్యాయమని నాగబాబు అన్నట్లు ఆయన తెలిపారు. వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని సాయి ఆరోపించారు.

ఎన్‌సీసీ ధ్రువీకరణ పరీక్ష


రాజాం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం ఎన్‌సీసీ-ఎ ధ్రువీకరణ పరీక్ష నిర్వహించారు. ప్రొసీడింగ్ ఆఫీసర్ కెప్టెన్ ఎస్.వెంకటరావు, బీవీ అచ్యుతకుమార్, డి.ఉదయ్, పి.పుష్పలత, కె.హరి సమక్షంలో పరీక్ష జరిగింది. ఏడు పాఠశాలలకు చెందిన 265 మంది కేడెట్స్ హాజరయ్యారు.

క్షతగాత్రులకు పరామర్శ


కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న కోండ్రు

రాజాం: రుషింగి నుంచి రాజులగుమ్మడ వెళ్లే రహదారిలో ఆర్టీసీ బస్సు, ఆటో ఢీకొన్న సంఘటనలో గాయపడిన 12 మంది స్థానిక జీఎంఆర్ కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిని మాజీ మంత్రి, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ సోమవారం రాత్రి పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. బాధితులకు రూ.25 వేల చొప్పున ఎక్స్‌గ్రేషియో అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రోడ్లు అస్తవ్యస్తంగా ఉండడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం జగన్‌రెడ్డి తక్షణమే స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబును సన్మానించిన బంగార్రాజు


చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న బంగార్రాజు

భోగాపురం: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబును సన్మానించినట్లు పార్టీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు తెలిపారు. మాడుగుల నియోజకవర్గంలో సోమవారం జరిగిన 'రా.. కదిలిరా' కార్యక్రమంలో పాల్గొన్న చంద్రబాబును మర్యాద పూర్వకంగా కలిసి, సన్మానించినట్టు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున, మాడుగుల నియోజకవర్గ అబ్జర్వర్ కర్రోతు నర్సింగరావు పాల్గొన్నారని తెలిపారు.

ఆరు స్థానాల్లో భారత ఆదివాసీ పార్టీ పోటీ

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్రంలోని ఆరు శాసనసభ స్థానాల్లో భారత ఆదివాసీ పార్టీ పోటీ చేస్తుందని ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు, మాజీ డిప్యూటీ కలెక్టర్ ఆరిక నీలకంఠ తెలిపారు. భారత ఆదివాసీ పార్టీ తరఫున దేశవ్యాప్తంగా నలుగురు ఎమ్మెల్యేలు గెలిచారని, ఈ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి పోటీ చేస్తున్నామని చెప్పారు. కురుపాం, పాలకొండ, అరకు, సాలూరు, పాడేరు, రంపచోడవరం, పోలవరం ఎమ్మెల్యే స్థానాలు, అరకు పార్లమెంట్ స్థానానికి తమ పార్టీ తరఫున అభ్యర్థులను నిలుపుతామన్నారు. గిరిజన సమస్యలు, గిరిజన హక్కుల పరిరక్షణ, చట్టాల అమలు, తదితర అంశాలతో తమ పార్టీ మేనిఫెస్టోకు రూపకల్పన చేసినట్టు చెప్పారు.

పారమ్మకొండపై శివరాత్రి జాతరకు సన్నాహాలు

సాలూరు రూరల్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వచ్చే నెల 8న పారమ్మకొండ వద్ద జాతరకు సన్నాహాలు చేస్తున్నారు. సుబ్బ గురువు ఆధ్వర్యంలో సాలూరు సనాతన ధర్మపరిషత్ సభ్యులు భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. పారమ్మకొండ మధ్య భాగంలో ఉన్న పాండవుల గుహ ఆలయానికి సున్నాలు వేశారు. శివదర్శనానికి వీలుగా ఏర్పాట్లు చేశారు. పారమ్మకొండ శిఖరంపై పారమ్మ ఆలయం, దివ్య అఖండ జ్యోతి తదితర ప్రాంతాల్లో పరిశుభ్రత పనులు నిర్వహించారు.

మద్యం సీసాల స్వాధీనం

చీపురుపల్లి: ఇటకర్లపల్లిలో సోమవారం జరిపిన దాడిలో 179 మద్యం సీసాలు పట్టుకున్నట్టు ఎస్ఐ కె.కిరణ్ కుమార్‌నాయుడు తెలిపారు. ఈ మేరకు చీపురుపల్లి పట్టణానికి చెందిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరిచామని చెప్పారు.

బోరును బాగు చేయరూ..

● గవిడిపేటలో తాగునీటికి ఇక్కట్లు
● పట్టించుకోని అధికారులు


పాడైన బోరు

గుర్ల: గవిడిపేట గ్రామంలో ఉన్న ఒకేఒక్క తాగునీటి బోరు గత రెండు నెలలుగా మరమ్మతులకు గురయ్యింది. కానీ ఇంతవరకు పట్టించుకునే నాథుడే కరువయ్యాడని గ్రామస్థులు వాపోతున్నారు. తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి బోరు బాగు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

క్లుప్తంగా..

టీడీపీకి అండగా ఉండాలి

గుర్ల: యువత రాజకీయాల్లోకి వచ్చి మంచిని స్వీకరించి, చెడును దూరం చేయాలని టీడీపీ తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గాసి కోటేశ్వరరావు అన్నారు. జమ్ము గ్రామంలో ఆయన సోమవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. తెలుగుదేశం పార్టీకి జిల్లాలోని యువత అండగా నిలవాలన్నారు.

జనసేన ఉత్తరాంధ్ర వ్యవహారాల ముఖ్యప్రతినిధిగా సతీష్‌కుమార్


పవన్, నాగబాబులతో సతీష్‌కుమార్

విజయనగరం: జనసేన పార్టీ ఉత్తరాంధ్ర వ్యవహారాల ముఖ్య ప్రతినిధిగా సుందరాపు సతీష్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ సోమవారం రాత్రి ఆదేశాలు జారీ చేసినట్టు ఆయన స్థానిక విలేకర్లకు తెలిపారు.

పశు వైద్య కళాశాలలో క్రీడోత్సవాలు

గరివిడి: స్థానిక పశువైద్య కళాశాలలో సోమవారం కళాశాల అసోసియేట్ డీన్ డా.మక్కెన శ్రీను క్రీడోత్సవాలు ప్రారంభించారు. 210 మంది విద్యార్థులు క్రీడా ప్రతిజ్ఞ చేశారు. క్రీడా సంబరాల్లో గోదావరి దేవి షరాఫ్ కళాశాల ప్రిన్సిపాల్ బలిజేపల్లి రవి ముఖ్యఅతిథిగా పాల్గొనగా, డా.వెంకటరావు, వ్యాయామ అధ్యాపకుడు బి.త్రినాథ్, ఎన్ఎస్ఎస్ సమన్వయ కర్త డా.షేక్ మస్తాన్ బీ, ప్రపంచ టెన్నికాయిట్ కోచ్ రామారావు, ఎస్‌డీఎస్ కళాశాల పీడీ బి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

5వ పోలీస్ బెటాలియన్‌కు నూతన కమాండెంట్

డెంకాడ: చింతలవలస 5వ పోలీస్ బెటాలియన్‌కు సోమవారం కొత్త కమాండెంట్ విచ్చేశారు. ఆదిరాజ్‌సింగ్ రానా ఐపీఎస్, ఏపీఎస్పీ నర్శీపట్నం నుంచి బదిలీపై వచ్చారు. ఆయనకు 5వ పోలీస్ బెటాలియన్ ఆఫీసర్స్ మినిస్ట్రీయల్ స్టాఫ్, మెడికల్ స్టాఫ్, పోలీస్ అసోసియేట్ మెంబర్స్ ఘనంగా స్వాగతం పలికారు. పదవీ బాధ్యత లు స్వీకరించిన అనంతరం బెటాలియన్‌లో ఉన్న స్కూల్, హాస్పిటల్, వెల్ఫేర్ కాంప్లెక్స్, క్యూఎం గ్రూపును సందర్శించారు.

గ్రామాభివృద్ధిపై దృష్టి సారించాలి

గజపతినగరం: గ్రామాల అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించాలని ఎంపీడీవో జయంత్ ప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా మండల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 30 పంచాయతీల్లో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు సాగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో సుదర్శనరావు, మండల అధికారులు పాల్గొన్నారు.

కొండచిలువ హల్‌చల్


షరాబుల కాలనీలో కొండచిలువ

గజపతినగరం: పురిటిపెంట పంచాయతీ షరాబుల కాలనీలో సోమవారం కొండచిలువ హల్‌చల్ చేసింది. కాలనీలో అకస్మాత్తుగా కొండచిలువ కనిపించడంతో కాలనీవాసులు భయాందోళనకు గురయ్యారు. చంపావతి నది వంతెన పక్కనే కాలనీ ఉండడంతో కొండచిలువ ఆ నదిలో నుంచి వచ్చి ఉంటుందని స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు. కొండచిలువను పట్టుకుని గోనెసంచిలో కట్టి చంపావతి నదిలో వదిలి వేశారు.